క్లుప్తంగా

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గోపూజ



ఆవులకు సేవ చేస్తున్న సేవాదళ్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం గోపూజ(మూగజీవుల సేవ) నిర్వహించారు. సత్యసాయి ప్రబోధించిన 'అందరికీ సేవ చేయండి – అందరినీ ప్రేమించండి' స్ఫూర్తితో సత్యసాయి సేవాదళ్ ప్రతినిధులు ఉక్కునగరం నుంచి అగనంపూడికి వెళ్లే రహదారి, చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఆవులకు పశువుల దాణా, అరటి పండ్లు, నీరు అందించారు. వాటికి తగిన సపర్యలు చేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, సేవాదళ్ సభ్యులు కె.వి.రమణ, పైడి నాయుడు, సుబ్బారావు, రామారావు, రంగరాజు, ప్రకాశ్, శ్రీనివాసరావు, కొండబాబు, సాయి విద్య తదితరులు పాల్గొన్నారు.

200 మంది పిల్లలకు పరీక్షలు



పిల్లలను పరీక్షిస్తున్న వైద్యులు

గాజువాక: స్థానిక సన్‌రైజ్ పిల్లల ఆస్పత్రి వైద్యులు ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుజాతనగర్ సమీపంలోని పాపయ్యరాజుపాలెంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 200 మంది పిల్లలకు ఉచిత రక్త పరీక్షలు చేసినట్టు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ టి.తిరుపతి తెలిపారు. అవసరమైన చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.సురేష్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచపది కవిరత్నగా ఉపాధ్యాయిని వరలక్ష్మి



అగనంపూడి: పరవాడ మండలం వాడచీపురుపల్లి ఆంగ్ల ఉపాధ్యాయిని నల్లా నాగ సూర్య వరలక్ష్మిని హైదరాబాద్‌కు చెందిన పంచపది కవన వేదిక ఆధ్వర్యంలో పంచపది కవిరత్న బిరుదుతో సత్కరించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన పాండురంగ విఠల్ సారథ్యంలో ఈ వేదిక తెలుగు భాష, సాహిత్యాభివృద్ధి కోసం పాటు పడుతుంది. ఈ మేరకు వేదిక ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వరలక్ష్మిని పంచపది కవిరత్నగా ఎంపిక చేసింది. నిర్వాసిత కాలనీలో నివాసముంటున్న వరలక్ష్మి తెలుగు భాషాభివృద్ధి, సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించడంలో ఎంతగానో కృషి చేస్తున్నారు.

కాలుష్య సమస్యపై నేడు ర్యాలీ



సమావేశంలో పాల్గొన్న గ్రామపెద్దలు

గాజువాక: పోర్టు రోడ్ పరిసర గ్రామాల్లో కాలుష్య సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు తెలిపారు. కాలుష్య బాధిత గ్రామాల ప్రతినిధులతో స్థానిక శ్రీకృష్ణదేవ రాయ కల్యాణ మండపంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. గంగవరం అదాని పోర్టు, స్టీల్‌ప్లాంట్ నుంచి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల వల్ల కాలుష్యం పెరిగిపోతోందని, ఈ సమస్యల పరిష్కారం కోసం ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ కాలనీ పెద్దలు సలాది వెంకట రమణ, ఇందుగుల దేముడు, సిరసపల్లి అప్పారావు, వీరయ్య, హనుమంతరావు, లక్ష్మణరావు, ప్రభాకర్, కొండలరావు, కరణం రామకృష్ణ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే పార్టీలో గుర్తింపు

- సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్
- గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- జేసీఎస్‌లకు బీమా నమోదు శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

కూర్మన్నపాలెం: అంకిత భావంతో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆదివారం జీవీఎంసీ 87వ వార్డు కణితి ఆర్యవైశ్య సామాజిక భవనంలో జేసీఎస్ గాజువాక నియోజకవర్గ స్థాయి బీమా నమోదు శిబిరం ప్రారంభించారు. అనంతరం వై ఏపీ నీడ్స్ జగన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం జేసీఎస్ మండల ఇన్‌చార్జిలు, కన్వీనర్లకు రూ.5 లక్షల చొప్పున ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. మొదటి దశలో మండల ఇన్‌చార్జులకు, వారి పరిధిలో ఉన్న కన్వీనర్లకు బీమా నమోదు చేస్తారన్నారు. అనంతరం దీనిపై కన్వీనర్లకు శిక్షణ ఇస్తారని, రెండో దశలో గృహసారథులకు బీమా నమోదు ప్రక్రియ చేపడతారన్నారు. ఏపీ సంక్షేమ సారథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. అయినా సీఎంపై ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఎవరు ఎంత చేసినా రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వలంటీర్ల వల్ల ఎవరికైనా హానీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారా? అని ప్రశ్నించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇస్తున్న స్క్రిప్టును పవన్‌కల్యాణ్ చదువుతున్నారని, పార్టీ పెట్టి పదేళ్లయినా సాధించిందేమీ లేదన్నారు. గత ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయిన పవన్‌కు ప్రజల్లో విలువ లేదన్నారు. ఓడిపోయిన తర్వాత గానీ, కోవిడ్ సమయంలో గానీ ఒక్కసారి కూడా గాజువాకలో తిరగని పవన్.. ఇప్పుడు హఠాత్తుగా గాజువాకపై ప్రేమ కలిగిందని, దీన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. జేసీఎస్ కో ఆర్డినేటర్ అన్నపురెడ్డి హర్షవర్ధన్ మాట్లాడుతూ పరిపాలనలో సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన సంస్కరణలతో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ 5వ స్థానంలో నిలిచిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో 1వ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్నికల పరిశీలకుడు తంగేడు సీతారామరాజు, గాజువాక వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చిన్నతల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఊరుకూటి చందు, బొడ్డు నరసింహపాత్రుడు, రాజాన రామారావు, మహమ్మద్ ఇమ్రాన్, ఇల్లపు ప్రసాద్, గుడివాడ లతీష్, మండల జేసీఎస్ ఇన్‌చార్జులు వాడపల్లి రామచంద్రరావు, మహమ్మద్ గౌస్, కులకూరి మంగరాజు, వార్డు ఇన్‌చార్జులు కోమటి శ్రీనివాసరావు, ధర్మాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన మండల ఇన్‌చార్జులు, కన్వీనర్లు, గృహసారథులు, ప్రజలు

మహనీయులను స్మరించుకోవాలి



బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: మహనీయులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 75వ వార్డు సీతానగరం ఎస్సీ కాలనీలో ఆది ఆంధ్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దళిత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబా సాహెబ్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, పల్లా శ్రీనివాసరావు, ఆది ఆంధ్రా యువజన సేవా సంఘం గౌరవాధ్యక్షుడు మార్టుపూడి పరదేశి, అధ్యక్షుడు కణితి వెంకటరావు, ప్రధాన కార్యదర్శి టేకేటి రాజు, మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్ పులి లక్ష్మీ భాయి, గంట్యాడ గురుమూర్తి, గంట్యాడ గోవింద రాజు, పెద్ద పెంటయ్య, సంపూర్ణం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ఉద్యమం ఆగదు



913వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకుని ఆ అంశానికి స్వస్తి పలికే వరకు కార్మికులు చేస్తున్న ఉద్యమాలు ఆగవని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం నాటికి 913వ రోజుకు చేరుకున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో హెచ్ఎంఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికులు కూర్చొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మిక వర్గం ఎంతగానో శ్రమించిందన్నారు. ఇలాంటి పరిశ్రమను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంట్‌ను నష్టాల ఊబిలోకి నెట్టే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, హెచ్ఎంఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బాలలు, బాల వికాస్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలో బాల వికాస్ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవ ప్రాముఖ్యతపై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొండయ్యవలస చిన ఆంజనేయ స్వామి ఆలయం నుంచి గ్రామంలో బాలలు స్వాతంత్య్ర సమరయోధుల వేషాధారణలో ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో అగనంపూడి సత్యసాయి భజన మండలి ప్రతినిధులు బి.వి.రామారావు, విందుల వరహాలు, రామారావు, బాలలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన



79వ వార్డు శివాజీనగర్‌లో ఓటర్ల జాబితా పరిశీలనలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ లక్ష్మారెడ్డి

అగనంపూడి: అర్హులైన ఓటర్లు మాత్రమే ఉండేలా ప్రస్తుతం జాబితాను పరిశీలిస్తున్నట్టు డిప్యూటీ కలెక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. 79వ వార్డు అగనంపూడి పరిసర ప్రాంతంలోని బూత్‌ల వారీగా పరిశీలన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదు, చిరునామాలో లేని ఓటర్లు తొలగింపు, నివాసం ఉంటున్న ప్రాంతాల్లో చేర్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్, సూపర్‌వైజర్లు దిలీప్‌కుమార్, బీఎల్‌వోలు శ్రావణి, సింగిడి సింహాచలం పాల్గొన్నారు.

కార్పొరేట్ వర్గాలకే కేంద్రం పెద్దపీట



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేశు

సీతంపేట: కార్మిక ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ వర్గాల అభివృద్ధికి మోదీ సర్కార్ కృషి చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు విమర్శించారు. రామాటాకీస్ వద్ద ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏఐటీయూసీ విశాఖ జిల్లా 13వ మహాసభ ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఫాసిస్ట్ ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవా రంగంలో బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం, విదేశీ పెట్టుబడులు ఆహ్వానించడం వంటి నిర్ణయాల వల్ల దేశం ఆర్థికంగా దివాళా తీస్తోందని విమర్శించారు. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో స్టీల్‌ప్లాంట్ ఒక్కటని, దానిని కూడా నష్టాల సాకుతో ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టిందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్చివేసిందన్నారు.

ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఎన్నిక..

మహాసభ సందర్భంగా ఏఐటీయూసీ విశాఖ జిల్లా నూతన నాయకత్వం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎం.మన్మథరావు, ప్రధాన కార్యదర్శిగా జి.ఎస్.జె.అచ్యుతరావు ఎన్నికయ్యారు. ముందుగా ఏఐటీయూసీ జెండాను సీనియర్ నాయకుడు బి.సి.మసేన్ ఎగురవేశారు.

అవయవదానాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలి



మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

సీతంపేట: పేదలకు ఉపయోగపడేలా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని సావిత్రిభాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ప్రపంచ అవయవదాన వారోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. కేజీహెచ్ వంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి ఆపరేషన్ల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయాలని, దానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలన్నారు. అవయవదానం చేసిన వారి పిల్లలకు ప్రోత్సాహకంగా ఉచిత విద్య, కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. ఉన్నత విద్యా సిలబస్‌లో అవయవదానాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని, ఈ విషయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీవీవో ఎస్.కరుణరాజు మాట్లాడుతూ అవయవదానంతో ఎంతో మందికి పునర్జన్మనిస్తున్న వారంతా దేవుళ్లతో సమానమన్నారు. అటువంటి కార్యాన్ని పెద్ద ఎత్తున చేస్తున్న గూడూరు మహాలక్ష్మి సేవలను అభినందించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన వారు అవయవ దానం చేయడం వల్ల వారి నుంచి సేకరించిన గుండె, కాలేయం, మూత్ర పిండాలు, ఊపిరితిత్తులు, ప్రేగులు, ఎముకలు, మూలుగ, కళ్లు మరణానికి చేరువైన వారికి అమర్చడం ద్వారా వారికి జీవితాన్ని ప్రసాదించవచ్చని పేర్కొన్నారు. అవయవదానానికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శరీరదాతలకు అభినందన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఏఎంసీ ప్రొఫెసర్ వి.పద్మజ, అనకాపల్లి డీటీవో వి.ఎల్.సుభాషిణి, ట్రస్టు కార్యదర్శి ఎస్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాల విక్రయాలు

జగదాంబ : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాల విక్రయాలు జరుగుతున్నాయని విశాఖపట్నం తపాలా శాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆర్.రాహుల్ ఆదివారం తెలిపారు. దేశ ప్రజల్లో జాతీయ భావం పెంపొందించేందుకు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగ 2.0'కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తపాలా శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన నిమిత్తం ఈనెల 11న ఆర్కే బీచ్‌లో భారీ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేందుకు తపాలా శాఖలో జాతీయ పతాకాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు, సంస్థలు, రాజకీయ పార్టీలు, కార్పొరేట్ సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాహుల్ కోరారు.

చలనచిత్రాల నిర్మాణానికి ప్రభుత్వ సహకారం



సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఏపీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్, డ్యాన్స్ డైరెక్టర్స్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథి ఎస్‌వీకే సినిమా నిర్మాత, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ సభ్యులకు నియామక పత్రాలు అందించారు. అనంతరం 500 మంది పేద కళాకారులకు బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖ నగరంలో చలనచిత్రాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఫిల్మ్ ఇండస్ట్రీ విశాఖ తరలి రావడానికి పలు సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు రాజా, రామారావు, రమేష్, నాగేంద్రమ్మ, నిర్మల భాను, విజయరమణి, శివ, మేరీ, సూర్య, ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు రాధ, ఏపీ టెక్ మెంబర్ సుశీల పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్
- కాకరలోవలో ఓటరు సర్వే పరిశీలన



ఓటరు జాబితాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

సింథియా: ఇంటింటికీ ఓటరు సర్వే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ ఆదివారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాకరలోవ 171 పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న ఓటర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. 17 ఏళ్లు నిండినవారు ముందస్తు నమోదులు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అర్హులైన నూతన ఓటర్లను గుర్తించాలన్నారు. ఫాం–6 ద్వారా నూతన ఓటర్ల నమోదు, ఫాం–6(బి), ఫాం–7, ఫాం–8 ద్వారా ఓటర్ల జాబితా వివరాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఏకేసీకాలనీ–2 సచివాలయాన్ని సందర్శించి 171,157, 163,159 పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. నిబంధనల మేరకు ఓటర్ల మార్పులు, చేర్పులు సవరించి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, బూత్‌స్థాయి అధికారులు ఉన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- దువ్వాడ ఫ్లైఓవర్ మీద పైకి తేలిన ఇనుప చువ్వలు
- వంతెన రహదారిపై గోతులు
- ప్రయాణికుల పాట్లు.. పట్టించుకోని అధికారులు



దువ్వాడ ఫ్లైఓవర్ మీద ఇనుప రాడ్లు పైకి తేలి ప్రమాదకరంగా మారిన రహదారి



వంతెన రహదారి మధ్యలో గోతులు

అగనంపూడి: దువ్వాడ ఫ్లైఓవర్ వంతెన మీదుగా ప్రయాణం.. ప్రమాదకరంగా మారింది. దువ్వాడ రైల్వే స్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి భీతిల్లుతున్నారు. వంతెనపై శ్లాబు పైకప్పు ఇనుప రాడ్లు పైకి తేలిపోయి ఉండడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రాణ సంకటంగా భావిస్తున్నారు. సుమారు ఏడాది నుంచి ఇదే రీతిలో రాడ్లు పైకితేలిపోయి ఇబ్బందికరంగా ఉన్నా.. అటు రైల్వే అధికారులు.. ఇటు ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. తమకు సంబంధం లేదంటూ ఆయా విభాగాల అధికారులు కప్పదాటుగా వ్యవహరిస్తూ ప్రయాణికులతో చలగాటమాడుతున్నారు.

నిత్యం వేలాది మంది రాకపోకలు..

నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు జీవీఎంసీ విలీన గ్రామాలతోపాటు సబ్బవరం మండలంలోని గ్రామాలకు ఇదే సమీప దారి కావడంతో నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. రాజీవ్‌నగర్ నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ మలుపు వద్ద, అక్కడి నుంచి ప్లాట్‌ఫామ్ వరకు వంతెనపైన నాలుగు చోట్ల రాడ్లు పైకి తేలి ప్రమాదకరంగా ఉండగా.. ఆరు చోట్ల ఏర్పడిన పెద్ద పెద్ద గోతులు ప్రయాణికులను భయపెడుతున్నాయి. ఆదమరచి వాహనాలు నడిపినా.. కొత్తవారు ఈ మార్గంలో ప్రయాణించినా ఇనుప రాడ్లు పైకి తేలి వాహనం టైర్లుకు అడ్డంగా పడుతున్నాయి. దీంతో వాహనం సడన్‌గా తూలి పడిపోతోంది.

తప్పిన పెద్ద ప్రమాదం..

ఆదివారం ఉదయం వెదుళ్లనరవకు చెందిన అప్పారావు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఈ మార్గంలో ఇనుప రాడ్ల పైనుంచి వెళ్లడంతో టైర్‌లో అవి దూరిపోయాయి. దీంతో వాహనం తూలిపడిపోయింది. టూ వీలర్‌ను నెమ్మదిగా నడపడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ వాహనానికి దూరంగా లారీ ప్రయాణించడంతో అప్పారావు పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డాడు. తరచూ ఇటాంటి సంఘటనలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



అధ్వానంగా వంతెన రోడ్డు

ఏడాదిగా ఇదే పరిస్థితి



రైల్వే ప్రయాణికులు, దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, వీఎస్ఈజెడ్ ఉద్యోగులు, సబ్బవరం శివారు గ్రామాలకు చెందిన వేలాది మంది ఫ్లైఓవర్ వంతెన ప్రమాదరకంగా ఉందని, తక్షణం బాగుచేయాలని ఏడాదిగా రైల్వే, జీవీఎంసీ అధికారులకు మొర పెట్టుకుంటున్నా.. పట్టించుకునే పరిస్థితి లేదు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– చట్టి తాతారావు, వెదుళ్లనరవ

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా



దువ్వాడ ఫ్లైఓవర్ వంతెనపై ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాలు ఇనుప చువ్వల మీదుగా వెళ్తున్నప్పుడు చక్రాలకు అడ్డంగా అవి దూరిపోతున్నాయి. ఇలా తరచూ జరుగుతోంది. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తున్నారు. జీవీఎంసీ, రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఫ్లైఓవర్ మీద ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలి.

–పి.పెద్దినాయుడు, కూర్మన్నపాలెం

శ్రీవారికి పుష్పాలతో సహస్ర నామార్చన



విశేష పుష్పాలతో సహస్ర నామార్చనలో తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌బీఎల్‌లోని శ్రీతిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీకి ఆదివారం విశేష పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. హారతులు పట్టిన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. శ్రీతిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల పర్యవేక్షణలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.